

లిటిల్ ఫ్లవర్‌కు లైంగిక మరకలు

కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్‌పై దాడి



ఆంజనేయులు గౌడ్‌ను తీసుకువెళుతున్న పోలీసులు

- బాలికలను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు
- అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు
- విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారుల విచారణ
- పాఠశాల మూసివేత.. విద్యార్థులు ఇళ్లకు..
- ఇదంతా ఎవరో చేయిస్తున్నారు : గౌడ్ కుటుంబం

అనంతపురం విద్య, ఆగస్టు 2: నగరంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్‌పై ఇద్దరు బాలికల కుటుంబ సభ్యులు శుక్రవారం దాడి చేశారు. అదే పాఠశాల హాస్టల్‌లో ఉంటున్న తమ చిన్నారులపై ఆయన కొన్నాళ్లుగా లైంగిక దాడికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఎన్నో ఏళ్ల నుంచి విద్యా సంస్థలను నిర్వహిస్తున్న ఆయనపై ఈ తరహా ఆరోపణలు రావడం కలకలం రేపింది. ఆంజనేయులు గౌడ్ వయసు 77 ఏళ్లు. విద్యాసంస్థల నిర్వహణతోపాటు సాహితీ, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఆయన నగరవాసులకు సుపరిచితులు. ఆయనపై దాడి జరుగుతున్న విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు వెంటనే పాఠశాలకు వెళ్లారు. నాలుగు, ఐదో తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలపై ఆయన లైంగిక దాడికి యత్నించారని కుటుంబ సభ్యులు ఆరోపించడంతో ఆయనను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ టీవీవీ ప్రతాప్ తెలిపారు. కాగా, డబ్బుల కోసం ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆంజనేయులు గౌడ్ కుటుంబ సభ్యులు ఆరోపించారు.

నెలన్నర క్రితం చేరారు..

నగరానికి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు తమ కూతుళ్లను నెలన్నర క్రితం లిటిల్ ఫ్లవర్ స్కూల్ హాస్టల్‌లో చేర్పించారు. ఆ ఇద్దరు మహిళలు తమ బంధువులతో కలిసి శుక్రవారం ఉదయం పాఠశాలకు చేరుకుని అనూహ్యంగా కరస్పాండెంట్‌పై దాడి చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. 'ఉదయం స్కూల్ వద్దకు వచ్చాం. పాప చేతిలో రూ.100 కనిపించడంతో ఎక్కడివి అని అడిగాము. కరస్పాండెంట్ ఇచ్చాడని చెప్పారు. కడుపు నొప్పిస్తోందని కూడా చెప్పడంతో గట్టిగా అడిగాము. తమ కరస్పాండెంట్ గదికిలోకి పిలిచి రెండు వారాలుగా బట్టలు విప్పి లైంగికంగా వేధిస్తున్నాడని చెప్పారు. ఎవరికీ చెప్పొద్దని డబ్బులు ఇచ్చాడని చెప్పారు. విషయం బయటకు చెప్పవద్దని బెదిరిస్తూ వారి తొడపై, చెంపపై కొట్టాడు. ఆయనను శిక్షించాలి. మాకు న్యాయం చేయాలి..' అని అన్నారు.



అధికారుల విచారణ...



లైంగిక వేధింపుల గొడవ విషయం తెలుసుకున్న డీఈఓ వరలక్ష్మి, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, ఎంఈఓ వెంకటస్వామి, లీగల్ అండ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంధ్యారాణి, ఐసీడీఎస్ అధికారులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులకు సూచించామని డీఈఓ తెలిపారు.

సమగ్రంగా విచారించాలి: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్: ఆంజినేయులు గౌడ్‌పై వచ్చిన ఆరోపణల గురించి సమగ్రంగా విచారించాలని పోలీసులు, విద్యా శాఖ అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకోవాలని, ఎక్కడా రాజీపడొద్దని సూచించారు.

ఉద్దేశపూర్వకంగానే..

మూడు దశాబ్దాలకు పైగా తాము పాఠశాలను నిర్వహిస్తున్నామని, వేలాది మంది తమ పాఠశాలలో చదువుకున్నారని ఆంజనేయులు గౌడ్ కుమారుడు దేవేంద్రగౌడ్, కోడలు సరిత, తమ్ముడి కుమారుడు రాజేంద్రగౌడ్ అన్నారు. ఆయన ఎందరికో సాయం చేశారని, ఎవరో ఉద్దేశపూర్వకంగా ఇరికించారని అన్నారు. తమకు కొందరిపై అనుమానాలున్నాయని, డబ్బుల కోసం, తమ పాఠశాల స్థలం కోసం ఇదంతా చేశారని అనుమానం కలుగుతోందని అన్నారు. త్వరలోనే పూర్తి సమాచారంతో మీడియా ముందుకు వస్తామని, తాము కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

పాఠశాల మూసివేత

వివాదం నేపథ్యంలో విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులు పాఠశాలను సందర్శించారు. తల్లిదండ్రులను పిలిపించి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. హాస్టల్‌లో ఉంటున్న సుమారు పాతిక మంది విద్యార్థులను కూడా ఇళ్లకు పంపించి, పాఠశాలను మూసివేయించారు. పాఠశాలను సీజ్ చేసి, ఇక్కడి విద్యార్థులను వేరే పాఠశాలలలో చేర్పించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు కలెక్టర్ నివేదించినట్లు తెలిసింది.



స్వామివారికి అన్నాభిషేకం

బుగ్గ రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం

తాడిపత్రి, ఆగస్టు 2: ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రిని పురస్కరించుకొని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. స్వామివారికి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, మండపారాధన, మహాన్యాస పారాయణం, పంచామృతాభిషేకం నిర్వహించారు. పార్వతీదేవి అమ్మవారికి వివిధ కూరగాయలు, ఆకుకూరలు, ఫలాలతో విశేషంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందజేశారు.



శాకంబరీదేవి అలంకరణలో పార్వతీదేవి అమ్మవారు

ఘనంగా మస్తాన్ వలి షంషీర్

గుంతకల్లు టౌన్, ఆగస్టు 2: హజరత్ సయ్యద్ మస్తాన్ వలి 389వ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం షంషీర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాత గుంతకల్లులోని ఊరువాకిలిలో నివాసముంటున్న రెడ్డి కులస్థుల ఇంటి నుంచి వేకువ జామున స్వామి వారి షంషీర్ ఊరేగింపును ప్రారంభించారు. మేళతాళాలు, యువకుల కేరింతల నడుమ అశ్వం మీద షంషీర్‌ను దర్గా వరకు తీసుకువచ్చారు. పాత గుంతకల్లు శివాలయం వద్ద ఉన్న బావి నుంచి తెచ్చిన నీటిని అశ్వం పాదాలకు పోసి మొక్కులు తీర్చుకున్నారు. షంషీర్‌ను స్వామి వారికి సమర్పించి, ముజావార్లు స్వామి పేరట ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షంషీర్ వేడుకను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎండు కొబ్బరిని దివిటీలలో కాల్చి ప్రసాదంగా తీసుకెళ్లారు. స్వామి వారికి చాదర్, పూల హారాలు, చక్కెర సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్గా ఆవరణలో కందూరి చేశారు.





స్వామి వారికి సమర్పిస్తున్న షంషీర్, భక్తుల మధ్య షంషీర్ ఊరేగింపు

మానవతా కళాప్రపూర్ణుడు రాఘవ

- పురస్కారాల ప్రదానోత్సవంలో వక్తలు
- బళ్లారి రాఘవకు ఘన నివాళులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 2: బళ్ళారి రాఘవ మానవతా కళాప్రపూర్ణుడు అని వక్తలు కొనియాడారు. ఆయన 144వ జయంతిని పురస్కరించుకుని లలితకళా పరిషత్‌లో శుక్రవారం బళ్లారి రాఘవ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. పరిషత్ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడు శంకరయ్య, పరిషత్ ప్రధాన కార్యదర్శి న్యాయవాది గాజుల పద్మజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు చిన్నారులు శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. తదనంతరం 2024 సంవత్సరానికి బళ్లారి రాఘవ స్మారక పురస్కారాలను అందజేశారు. పద్యనాటక రచయితలు పల్లేటి లక్ష్మీకులశేఖర్, మర్రాటి ఈశ్వరీగోపాల్‌కు రాష్ట్రస్థాయి, పౌరాణిక నాటక కళాకారులు దాసరి దయానంద్, పుట్లూరు సంజీవరెడ్డికి జిల్లాస్థాయి పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. సమాజంలో మార్పు కోసం బళ్లారి రాఘవ ప్రతిక్షణం పరితపించారని అన్నారు. తన నటనతో మహాత్మాగాంధీనే మైమరిపించారని గుర్తుచేశారు. కళాకారులను ఈ తరంవారు చిన్నచూపు చూడడం తగదని అన్నారు. నేటికీ ఎంతోమంది ఉద్యోగులు తమ ప్రవృత్తిగా కళారంగాన్ని ఎంచుకుంటున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, డాక్టర్ పతికి రమేష్ నారాయణ, కళాకారులు సంగాల నారాయణస్వామి, రామగోవింద్‌సాగర్, అస్లాంబాషా, లోకేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



బళ్లారి రాఘవకు నివాళులర్పిస్తున్న కళాకారులు



పురస్కారాలు అందుకుంటున్న పల్లేటి లక్ష్మీకులశేఖర్, మర్రాటి ఈశ్వరీగోపాల్, దాసరి దయానంద్, పుట్లూరు సంజీవరెడ్డి

గంగంపల్లి తండాలో వైసీపీ అరాచకాలు

● ఎమ్మెల్యే పరిటాల సునీత



గంగంపల్లి తండాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఆగస్టు 2: వైసీపీ నాయకుల అరాచకాలకు ప్రత్యక్ష ఉదాహరణ గంగంపల్లి తండా అని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. తండాలో శుక్రవారం ఆమె పర్యటించారు. తండాలో పేదలకు ఇళ్లు నిర్మిస్తామని మోసం చేసింది కాకుండా ఆర్డీటీ నిర్మిస్తున్న ఇళ్లకు అప్పట్లో ఇసుకను ఇవ్వకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారని ఆరోపించారు. అప్పట్లో ఈ విషయం తన దృష్టికి రావడంతో ఇసుక అందేలా చేశానని అన్నారు. అప్పటి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని కలిస్తేనే ఇసుక ఇస్తామని చెబుతూ.. ఒక ఏడాదిపాటు గృహ నిర్మాణాలు నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముత్యాలమ్మ ఆలయ కమిటీ నిధులతో అప్పటి కమిటీ చైర్మన్ ధర్మవరపు కొండన్న బోరు, మోటారును సమకూర్చారని అన్నారు. అనంతరం ఆమె రైతు గంగాధర్ సాగు చేసిన దానిమ్మ, అరటి తోటలను పరిశీలించారు. పంట పెట్టుబడి, మందుల పిచికారీ, దిగుబడుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, గంగంపల్లి గంగాధర్, మాదాపురం శంకర్ ఉన్నారు.

తనిఖీల పేరిట వసూళ్లు

- ప్రత్యేక బృందం వస్తోందని డీలర్లకు బెదిరింపులు
- వ్యవసాయశాఖలో కొందరు అధికారుల దందా



అనంతపురం అర్బన్, ఆగస్టు 2: వ్యవసాయ శాఖలో తనిఖీల పేరుతో కొందరు అధికారులు వసూళ్లకు దిగుతున్నారు. వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు నకిలీ ఎరువులు, పురుగుల మందులను గుర్తించేందుకు వ్యవసాయ శాఖ జిల్లా యంత్రాంగం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు చేసింది. ఓ కంపెనీ నకిలీ క్రిమిసంహారక మందులను తయారు చేసి విక్రయిస్తోందన్న సమాచారంతో కమిషనర్ రహస్యంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు అధికారులు వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. ప్రత్యేక బృందం తనిఖీలకు వస్తోందని, జిల్లా ఉన్నతాధికారులు చాలా సీరియస్‌గా ఉన్నారని కొందరు డీలర్లను తాడిపత్రి నియోజకవర్గం పరిధిలోని ఓ అధికారి బెదిరించినట్లు తెలిసింది. ఓ డీలర్‌ను భయభ్రాంతులకు గురిచేసి క్యూఆర్ కోడ్ ద్వారా రూ.75 వేలు జమ చేయించుకున్నారని ప్రచారం జరుగుతోంది. డబ్బులు ఇస్తే ఏం ఇబ్బంది లేకుండా మ్యానేజ్ చేస్తానని, లేదంటే అంతేసంగతులని బెదిరించడంతో డీలర్ బెంబేలెత్తినట్లు సమాచారం. ఈ వ్యవహారం ఆలస్యంగా బయటకు పొక్కడంతో వ్యవసాయ శాఖలో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఈ నెల మొదటి వారంలో కమిషనరేట్ ఆదేశాలతో తిరుపతికి చెందిన ఓ ఏడీ జిల్లాలో నాలుగు రోజులపాటు పలు మండలాల్లో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలోనూ కొన్ని మండలాల అధికారులు డీలర్ల నుంచి సేల్స్ ఆధారంగా రూ.2 వేల నుంచి ఆపైగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. తిరుపతి ఏడీఏ తనిఖీల్లో నిబంధనల అతిక్రమించినట్లు బయటపడిన దుకాణాల వివరాలను అధికారులు బయటకు రాకుండా తొక్కిపెట్టారని సమాచారం. ప్రత్యేక బృందాలు ఎప్పుడు తనిఖీలకు వచ్చినా సందట్లో సడేమియా అన్న చందంగా డీలర్ల నుంచి వసూలు చేయడం కొందరు అధికారులు పనిగా పెట్టుకున్నారని బాధితులు వాపోతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

మూలుగుతున్న పాతసామాను

- ట్రంకు పెట్టెలు, వంట సామగ్రికి తుప్పు
- గదుల కొరతతో విద్యార్థుల అవస్థలు
- వసతి గృహాలను పట్టించుకోని అధికారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 2: సంక్షేమ వసతి గృహాలకు అసలే గదుల కొరత వెంటాడుతోంది. ఈ పరిస్థితుల్లో ఉన్న గదులను కూడా పాత సామాను భద్రపరచడానికి వినియోగిస్తుండడంతో విద్యార్థులు ఇరుకు గదుల్లో మరింత ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని పలు వసతి గృహాల గదుల్లో కాలం చెల్లిన ట్రంకు పెట్టెలు, వంటసామగ్రి తదితర వస్తువులతో నింపేస్తున్నారు. దాదాపు పదేళ్లుగా తుప్పుపట్టిన, విరిగిపోయిన ట్రంకు పెట్టెలు, వంట సామగ్రి పేరుకుపోవడంతో వాటిని ఎక్కడుంచాలో తెలియక వసతి గృహాల్లోని విద్యార్థుల గదుల్లో డంప్ చేశారు. దీంతో విద్యార్థులకు గదుల కొరత ఏర్పడుతోంది. వీటిని ఎప్పటికప్పుడు తరలించాల్సిన ఆయా సంక్షేమశాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. సాధారణంగా ఈ వేస్టేజీలను జేసీ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించి విక్రయిస్తారు. అనంతరం వచ్చిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వానికి జమచేస్తారు. జేసీ దృష్టికి ఏ ఏ వసతి గృహాల్లో ఎంత వేస్టేజీ ఉందన్న నివేదికలు పంపడంలో సంక్షేమ శాఖల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పదేళ్ల క్రితం టెండర్లు నిర్వహించి పాత సామాగ్రిని తరలించినట్లు పలువురు వార్డెన్లు పేర్కొంటున్నారు. అప్పటి నుంచి ఎలాంటి టెండర్లు నిర్వహించకపోవడంతో వసతి గృహాల్లోని గదుల్లో భద్రపరచాల్సి వస్తోందని... ఫలితంగా విద్యార్థులు ఉండటానికి గదుల కొరత ఏర్పడుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కలుగుజేసుకొని ఆ పాత సామాగ్రిని విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

కుప్పలుగా..

జిల్లా వ్యాప్తంగా అన్ని సంక్షేమ వసతి గృహాల్లో కాలంచెల్లిన ట్రంకుపెట్టెలు, వంట సామగ్రి తదితర వస్తువులు కుప్పలుతెప్పలుగా పేరుకుపోయాయి. వాటన్నింటిని బహిరంగ మార్కెట్ ధర ప్రకారం అమ్మితే ఒక్కో వసతి గృహంలోని సామగ్రి రూ. లక్షకుపైగా విలువ ఉంటుందని సమాచారం. జిల్లా వ్యాప్తంగా అన్ని సంక్షేమ వసతి గృహాల్లోని వేస్టేజీని అమ్మితే దాదాపు రూ. కోటి వరకూ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కనీసం ఏ సంవత్సరం ఎంత వేస్టేజీ బయటపడుతుందోనన్న నివేదికలు సైతం అధికారుల వద్ద లేవంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎప్పటికప్పుడు వార్డెన్ల నుంచి నివేదికలు తెప్పించుకొని వాటిని కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు అందజేయాల్సిన సంక్షేమశాఖల అధికారులు పట్టించుకోలేదని తెలుస్తోంది.



జిల్లా కేంద్రంలోని ఓ వసతి గృహంలో పాత ట్రంకు పెట్టెలు, వంట సామగ్రి

గదుల కొరత..

వసతి గృహాల్లో వేస్టేజీ పేరుకుపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. బయట ప్రాంతాల్లో వేస్తే వర్షాలు, దుమ్ము, ధూళికి తుప్పుపట్టి పాడైపోతాయోనని పలువురు వార్డెన్లు వసతిగృహాల్లోని గదుల్లో భద్రపరుస్తున్నారు. కొన్నిచోట్ల రెండు మూడు గదుల్లో వాటిని భద్రపరచడంతో విద్యార్థులకు గదుల కొరత ఏర్పడుతోంది. అసలే ఉన్న గదులు పెచ్చులూడి ఇబ్బందులు విద్యార్థులకు ఈ వేస్టేజీ డంప్‌తో గదుల సమస్య తీవ్రమవుతోంది. ఏడాదికేడాదికి వేస్టేజీ పేరుకుపోతుండటంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

నిబంధనల ప్రకారం చేస్తాం..



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వసతి గృహాల్లోని కాలంచెల్లిన ట్రంకుపెట్టెలు తదితర వస్తువులను విక్రయిస్తాం. ఈ విషయంపై రాష్ట్ర అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం.

-కుష్బూ కొఠారీ, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల డీడీ

పంచాయతీ కార్యదర్శిపై దాడి

రామగిరి, ఆగస్టు 2: మండల పరిధిలోని మంగాపురం గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంసీ పల్లి గ్రామ కార్యదర్శి నాగభూషణంపై వైసీపీ నాయకులు శుక్రవారం దాడి చేశారు. గ్రామంలో తిరుగుతూ పింఛన్లు పంపిణీ చేయాల్సిన అవసరం ఏముందని, సచివాలయం వద్ద ఇవ్వొచ్చు కదా అని వైసీపీ నాయకులు రాజశేఖర్, సుబ్బరాయుడు, గంగన్న తదితరులు ఆయనపై దాడికి దిగారని గ్రామస్థులు తెలిపారు. తమకే ముందుగా పింఛన్లు ఇవ్వాలని కార్యదర్శిని దూషించారని, తరువాత వస్తానని చెప్పడంతో దాడి చేశారని అన్నారు. కులం పేరుతో దూషిస్తూ, అతని వద్ద ఉన్న పింఛన్ డబ్బులను లాక్కునేందుకు ప్రయత్నించారని తెలిపారు. కార్యదర్శి వారి నుంచి తప్పించుకుని రామగిరి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, ఆగస్టు 2: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 2,650 టన్నుల టమోటాలు వచ్చాయని అన్నారు. కిలో సరాసరి ధర రూ.13, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

బాబు పర్యటన తీరు ప్రశంసనీయం

సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



మడకశిర, ఆగస్టు 2: సీఎం చంద్రబాబునాయుడు మడకశిరకు రావడం చాలా సంతోషకరమని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. ఒక ప్రభుత్వ కార్యక్రమాన్ని చాలా సాదాసీదాగా నిర్వహించారని, బలవంతపు తరలింపులు లేకపోవడం అభినందనీయమన్నారు. ఆయన శుక్రవారం తన స్వగ్రామం నీలకంఠాపురంలో విలేకరులతో మాట్లాడారు. మడకశిరలో పదేళ్లుగా నెలకొన్న సాగు, తాగునీటి సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. పరిశ్రమలు, రోడ్లు వంటి వాటికి సంబంధించి రైతులకు ముఖ్యమంత్రి స్పష్టమైన హామీలు ఇవ్వడం పట్ల మడకశిరవాసిగా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వాటన్నింటినీ వెంటనే అమలు పరిచేశక్తి ఈ ప్రభుత్వానికి ఇవ్వాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదానికి సుప్రీంకోర్టు పరిష్కారం చూపించిందని అన్నారు. దీంతో అందరికీ మేలు జరుగుతుందని భావిస్తున్నానని వెల్లడించారు.

30 ఏళ్ల పోరాటానికి ఫలితం

ఎస్సీ వర్గీకరణపై ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజు తదితరులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 2: వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా జరుగుతున్న పోరాటానికి ఫలితం లభించిందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై 30 ఏళ్ల పోరాటం ఫలించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కొన్నేళ్లుగా మందకృష్ణ మాదిగ, ఇతర నాయకులు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. గతంలో కొందరు నాయకులు ఈ ఉద్యమాన్ని తమ స్వార్థం కోసం తొక్కి పెట్టారన్నారు. ఒక్క చంద్రబాబు నాయుడు మాత్రమే మాదిగలకు అండగా నిలబడి వారి భావోద్వేగాన్ని అర్థం చేసుకున్నార న్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా లక్షలాది మంది మాదిగలకు, 59 ఉప కులాలకు మేలు జరగబోతోందన్నారు. ఎస్సీ, ఎస్టీల్లోని నిజమైన పేదలకు రిజర్వేషన్ ఫలాలు అందుతాయన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని తమ ప్రభుత్వం త్వరలోనే అమలు చేయబోతోందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. వర్గీకరణపై సుప్రీం తీర్పు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బీసీఆర్ దాస్, టీడీపీ నాయకులు బుగ్గయ్య చౌదరి, డిష్ నాగరాజు, కూచి హరి, లక్ష్మీనరసింహ, సరిపూటి రమణ, లక్ష్మీనరసింహులు, వెంకటనారాయణ, కృష్ణకుమార్, నారాయణస్వామి, ఓంకార్‌రెడ్డి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

మాజీ మంత్రి సాకే శైలజానాథ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టును స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు వేగవంతం చేసి తగిన న్యాయం చేకూరేలా చూడాలని ఆయన కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎంతో మంది పోరాటం చేశారని, ఇప్పటికైనా తగిన న్యాయం జరిగినందుకు సంతోషమన్నారు. రాజకీయాలకు తావులేకుండా వెంటనే అమలు చేయాలన్నారు. అప్పటి వరకు ఉద్యోగోన్నతులు, ఉద్యోగ నియామకాలు నిలిపి వర్గీకరణ పూర్తి చేసిన తరువాత అర్హులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రస్తుతం నీట్ విద్యార్థులకు అయిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

● అనంతపురం క్లబ్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పూర్వవైభవం తీసుకొచ్చి ప్రారంభిస్తామని చెప్పడం సంతోషకరమని శైలజానాథ్ పేర్కొన్నారు. క్లబ్‌లో పేకాట ఆడిస్తామని ఎమ్మెల్యే ఏమీ చెప్పలేదనీ, క్రీడాపరంగా అభివృద్ధి చెస్తామన్న ఆలోచనతో అలా అని ఉండవచ్చని విలేకరుల ప్రశ్నకు బదులిచ్చారు. కమిటీ సభ్యుల ఎన్నిక ప్రణాళిక ప్రకారం, నిబంధనల మేరకు జరిగేలా చూడాలన్నారు.

ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

కొత్తచెరువు, ఆగస్టు 2: ఓపెన్‌స్కూల్ పది, ఇంటర్‌లో చేరే అభ్యర్థులు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఈ లాజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి ఈనెల 27తో గడువు ముగుస్తుందన్నారు. అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపీఎన్ఎస్‌సీహెచ్ ఓఓఎల్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబరు 4దాకా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద



విద్యుద్దీపాల వెలుగులో టీబీ డ్యాం

బొమ్మనహాళ్, ఆగస్టు 2: తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో శుక్రవారం సాయంత్రానికి 1,90,653 క్యూసెక్కులుగా ఉంది. దీంతో జలాశయానికి ఉన్న 33 గేట్లలో 28 గేట్లను నాలుగు అడుగులు, మిగతా 5 గేట్లను ఒక్కటిన్నర అడుగులు పైకి ఎత్తి నీటిని నదికి విడుదల చేశారు. ప్రస్తుతం ఔట్‌ఫ్లో నదికి, కాలువలకు వదిలే నీటితో కలిపి 1,82,160 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 105.788 టీఎంసీలుండగా శుక్రవారం సాయంత్రానికి 1631.29 అడుగులతో 99 టీఎంసీల నీటి నిల్వ ఉంది. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కి.మీ. వద్ద 1139 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 2: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17,500, కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.11వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 651టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మొదలెట్టేశారు !

పంచాయతీరాజ్‌లో పోస్టింగ్‌ల గోల..!



- ఈఈలు, డీఈఈల పోస్టులకు తీవ్రపోటీ
- ఎవరికివారుగా అధికార వర్గాల పైరవీలు
- కొందరిలో పోస్టింగ్, మరికొందరిలో బదిలీ టెన్షన్



జిల్లా పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ ఉద్యోగుల్లో బదిలీల ఉత్కంఠ సాగుతోంది. ప్రధానంగా ఈఈ, డీఈఈల పోస్టింగ్‌ల కోసం పెద్దఎత్తున పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. అయితే బదిలీలకు సంబంధించి ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు వెలువడకపోవడంతో ఆశాఖ ఉద్యోగులు ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

- అనంతపురం సిటీ

ఈఈలు, డీఈఈల పోస్టులకు తీవ్రపోటీ

ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) ఈ రెండు పోస్టులు ఎంతో కీలకమైనవి. దీంతో ఈ పోస్టుల కోసం ఆశాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లానే కాకుండా కర్నూలు జిల్లా నుంచి ఒక అధికారి డీఈఈగా వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆశాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఉమ్మడి జిల్లా పరంగా.. పీఆర్ఐ అనంతపురం, పీఐయూ పెనుకొండ, క్యూసీ ఈఈ, అనంతపురం పీఐయూ ఈఈల పోస్టుల కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోందని సమాచారం. డీఈఈల పరంగా పరిశీలిస్తే.. ఇప్పటికే అనంతపురం పీఆర్ఐ -1, అనంతపురం పీఆర్ఐ-2 డివిజన్‌లకు ఇన్‌చార్జి డీఈఈలు వచ్చేయగా.. మిగిలిన క్యూసీ విభాగంలో - 2, పీఆర్ఐ అనంతపురం పరంగా.. కళ్యాణదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ, పీఐయూ విభాగం పరంగా.. 2 డీఈఈల పోస్టుల కోసం పెద్దఎత్తున ఎవరి స్థాయిలో వారు పైరవీలు చేస్తున్నారని తెలిసింది.

గుట్టుగా పైరవీలు...

ఈఈలు, డీఈఈల పోస్టింగ్‌ల కోసం ఆ శాఖలో పనిచేస్తున్న కొందరు ఈఈలు, కొందరు డీఈఈలు ఎవరి స్థాయిలో వారు తమదైన శైలిలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న ఒక డీఈఈ అనంతపురం ఈఈ పీఏ స్థానంలో ఇక్కడికి వచ్చి అదే ఈఈ పోస్టింగ్‌కు ఇన్‌చార్జి గా వ్యవహరించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అది కుదరకపోతే క్యూసీ ఈఈగా వెళ్లాలని ప్లాన్ చేసుకున్నట్లు సమాచారం. పీఐయూ విభాగంలో పనిచేస్తున్న ఒక డీఈఈ మాత్రం క్యూసీ డీఈఈగా వచ్చి అదే క్యూసీ ఈఈ పోస్టింగ్ ఇన్‌చార్జి ఈఈగా కూడా పోస్టింగ్ పొందాలని ప్రయాత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. వీరితో పాటు అదే పీఐయూ విభాగంలో ముగ్గురు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కూడా తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తూ..పీఆర్ఐ పరంగా కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం ఇన్‌చార్జి డీఈఈలుగా వెళ్లాలని ప్లాన్ చేసుకున్నట్లు ఆశాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఇదే శాఖకు చెందిన మరో ఇద్దరు అధికారులు కూడా ఒకరు పీఐయూ ఈఈగా కానీ, పెనుకొండ పీఐయూ ఈఈగా కానీ, పీఆర్ఐ ఈఈగా కానీ పోస్టింగ్ పొందేందుకు తీవ్రంగా యత్నిస్తున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో మరో అధికారి కూడా పీఆర్ఐ డీఈఈగా వచ్చి పీఆర్ఐ ఈఈగా పోస్టింగ్ కోసం కథ నడుపుతున్నారని జోరుగా చర్చసాగుతోంది. ఇలా అదే శాఖలో పనిచేస్తున్న మరికొందరు అధికారులు కూడా తమదైన శైలిలో ఆయా పోస్టింగ్‌ల కోసం పెద్దఎత్తున పైరవీలు మొదలెట్టారు. కాగా మరో మూడు నెలల్లో ఆశాఖ ఎస్ఈ స్థాయి అధికారి కూడా ఉద్యోగ విరమణ ఉండటంతో ఆ పోస్టు కోసం కూడా పోటీ నెలకొన్నట్లు తెలిసింది. అయితే అంతలోనే ఉద్యోగోన్నతుల ప్రక్రియ సాగుతుందని కూడా ప్రచారం ఉంది.

కొందరిలో ఆందోళన

శాఖలో పనిచేస్తున్న కొందరు ఈఈలు, డీఈఈలు ఎవరికి వారు తమదైన శైలిలో పైరవీలు చేస్తుండటంతో ఇప్పటివరకు ఆయా పోస్టుల్లో పనిచేస్తున్న అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఎప్పుడు, ఎక్కడికి ఎవరిని బదిలీ చేస్తారో.. అని బాధిత వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రధానంగా ముగ్గురు ఈఈలు, ముగ్గురు డీఈఈలు అంతర్మథనం చెందుతున్నారని సమాచారం. ఇద్దరు అధికారులైతే మరీ దారుణం. గత ప్రభుత్వంలో లక్షలు వెచ్చించి పోస్టింగ్ తెచ్చుకున్నామని.. ఇప్పుడు తమను కదిలిస్తే ఎలా అని కొందరి వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఏది ఏమైనా శాఖ పరంగా జరుగుతున్న తాజా పరిణామాలు ఆశాఖ వర్గాల్లో ఉత్కంఠ రేపడంతో పాటు కొందరు అధికారుల్లో బదిలీల ఆందోళన మొదలైంది.

ఆశాఖ వర్గాల్లో చర్చ...

ఉద్యోగుల బదిలీలకు సంబంధించి స్పష్టమైన ఉత్తర్వులు రాకపోయినా కొందరు అధికారులు పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు ఆశాఖలో జోరుగా చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో మిగిలిన అధికార వర్గాలు సైతం పోస్టింగ్‌ల కోసం పైరవీలు మొదలెట్టాయి. కొందరైతే మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సుల కోసం క్యూ కట్టారని తెలిసింది. మరికొందరు అధికారులు తమదైన శైలిలో కాసులు కూడా సమర్పించి పోస్టింగ్ తెచ్చుకోవాలని పథకం వేశారని తెలుస్తోంది. పైగా శాఖలో రెగ్యులర్ డీఈఈలు లేకపోవడం, మరోవైపు శాఖలో ఉద్యోగోన్నతులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంతో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లే పైరవీల ద్వారా ఇన్‌చార్జి డీఈఈ పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు. ఈ తరహా పోస్టింగ్‌లు గత ప్రభుత్వంలో భారీగా జరిగాయి. ఏది ఏమైనా పీఆర్‌లో కొందరికి బదిలీ ఫీవర్ పట్టుకుంటే.. మరికొందరికి పోస్టింగ్ భయం పట్టుకున్నట్లైంది.



కల్లూరు ఏటీఎంలో చోరీ

రూ.3.28లక్షలు అపహరణ

గార్లదిన్నె, ఆగస్టు 2: గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేసి అందులోని నగదుతో దుండగులు ఉడాయించిన సంఘటన మండలంలోని కల్లూరు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని కల్లూరు ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి తెల్లవారుజామున 2:30 గంటల ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చారు. ముఖం కనిపించకుండా మంకీ క్యాప్‌లు వేసుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్‌తో మొదటగా ఏటీఎంలోని డిపాజిట్ ఏటీఎంను కట్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. తర్వాత విత్‌డ్రాల ఏటీఎంను కట్ చేసి అందులోని రూ.3,28,600 నగదుతో ఉడాయించారు. ఏటీఎంలో చోరీ జరుగుతున్నట్లు మంగళగిరిలోని ఎస్‌బీఐ ఆఫీస్‌కు మెసేజ్ వెళ్లింది. అక్కడి భద్రతా సిబ్బంది అనంతపురం పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే అప్రమత్తమైన అనంతపురం డీఎస్పీ వెంకట శివారెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ గౌస్‌బాషా సంఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే దుండగులు పారిపోయారు. ఈ ఘటనపై ఎస్‌బీఐ మేనేజర్ రామాంజిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



నిందితులు కట్ చేసి చోరీకి పాల్పడిన ఏటీఎం

మాకు నచ్చిన చోటుకే పోతాం!

- ☆ పాత స్కూల్‌కు వెళ్లమంటున్న టీచర్లు
- ☆ ఎస్ఎస్ఏ నుంచి పలువురు రిలీవ్
- ☆ వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ఎంట్రీ
- ☆ ప్రభుత్వం మారడంతో ఎట్టకేలకు బయటకు
- ☆ ఇప్పుడు దగ్గరి స్థానాల కోసం యత్నాలు
- ☆ రూ.లక్షలు కుమ్మరించేందుకైనా సిద్ధం!

అనంతపురం విద్య, ఆగస్టు 2: సమగ్రశిక్ష ప్రాజెక్టు నుంచి రిలీవ్ అయిన టీచర్లకు 'దగ్గరి' స్థానాలు ఇచ్చేందుకు విద్యాశాఖ అధికారులు యత్నిస్తున్నట్లు తెలిసింది. సుదూరప్రాంతాల్లోని స్కూళ్ల నుంచి అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధుల సిఫార్సుతో చాలా మంది టీచర్లు ప్రాజెక్టులోకి వచ్చారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా, నిబంధనలు పాటించకుండానే ప్రాజెక్టులోకి వీరు ఎంట్రీ ఇచ్చారు. అప్పటి కలెక్టర్, ఏపీసీ, డీపీసీ నిబంధనలు పాటించలేదు. దీంతో వైసీపీ ముద్ర పడిన టీచర్లు చాలామంది సులువుగా దొడ్డిదారిలో ప్రాజెక్టులోకి సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా వచ్చి స్థిరపడ్డారు. ఫిర్యాదులు వెళ్లడంతో విచారణ చేసిన కలెక్టర్ అలాంటి అధికారులను వెంటనే రీప్యాట్రియేషన్ చేయాలంటూ డీపీసీకి, ఏపీసీకి ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఇటీవల అధికారులు వారిని రిలీవ్ చేశారు. నిబంధనల ప్రకారం ప్రాజెక్టు నుంచి రిలీవ్ అయ్యి డీఈఓకు రిపోర్ట్ చేసుకున్న టీచర్లను వాళ్లు వచ్చిన చోటు(పాత స్కూల్)కే పంపాలి. లేదా అక్కడ ఖాళీ లేకుంటే అదే మండలంలోని స్కూల్‌కు లేదా అదే హెచ్ఆర్ఏ స్కూల్‌కు పంపాలి. అయితే ఇప్పుడు కొత్త స్కూళ్లకు, దగ్గరలోని స్కూళ్లకు వెళ్లాలని కొందరు టీచర్లు అధికారులతో పైరవీలకు సిద్ధమైనట్లు సమాచారం. వచ్చిన చోటుకు కాకుండా నచ్చిన చోటకు వెళ్లడానికి ట్రై చేస్తున్నట్లు తెలిసింది. దీనికి వెనుక లక్షలు చేతులు మారుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

సమగ్రశిక్ష ప్రాజెక్టులోకి ఇలా..

ప్రాజెక్టులోని వచ్చిన చాలామంది టీచర్లలో 80 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్ల దూరంలోని స్కూళ్లలో పనిచేస్తున్న వారే అధికంగా ఉన్నారు. కొందరు పక్క జిల్లాల నుంచి కూడా వచ్చారు. అంత దూరం వెళ్లలేక...పైరవీలతో జిల్లా కేంద్రంలోని ప్రాజెక్టులోని సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులు దక్కించుకుని ఇక్కడే తిష్టవేశారు. గత ప్రభుత్వంలో వచ్చినవారి స్కూళ్లు, మండలాలు, జిల్లాలు పరిశీలిస్తే.... ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి డీ హీరేహాళ్ మండలం లోని దేవగిరి ఎంపీపీ స్కూల్ నుంచి, అసిస్టెంట్ ఏఎంఓ మాధవరెడ్డి డీ. హీరేహాళ్ మండలంలోని కడలూరు ఎంపీయూపీ స్కూల్, మరో అసిస్టెంట్ ఏఎంఓ చంద్రమోహన్‌రెడ్డి ఉరవకొండ మండలంలోని వ్యాసాపురం ఎంపీయూపీ స్కూల్ నుంచి, అసిస్టెంట్ అలెస్కో గోవింద్‌రెడ్డి బెళుగుప్ప మండలంలోని జడ్పీ హైస్కూల్ నుంచి, అసిస్టెంట్ సీఎంఓ గోపాల్ విడపనకల్లు మండలంలోని హావళిగి స్కూల్ నుంచి, జీసీడీఓ మహేశ్వరి శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు గర్ల్స్ జడ్పీ హైస్కూల్ నుంచి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ రాంప్రసాద్‌రెడ్డి డీ.హీరేహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట స్కూల్ నుంచి అసిస్టెంట్ ఐఈడీ షమా కర్నూలు జిల్లా ఆలూరు మోడల్ స్కూల్ నుంచి వచ్చినట్లు సమాచారం.

కలెక్టర్‌కు ఫిర్యాదులతో వెనక్కు..

గతంలో ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదు. కేవలం వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు చెప్పారంటూ అప్పటి అధికారులు వీళ్లను ప్రాజెక్టులోకి తీసుకున్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వారి నియామకంపై కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో కలెక్టర్ విచారణ చేయించారు. నిబంధనలకు విరుద్ధంగా వచ్చిన వారిని వెంటనే రీప్యాట్రియేషన్ చేశారు. దీంతో రీప్యాట్రియేషన్ అయిన వారిలో చాలా మందిని డీపీసీ, ఏపీసీ రిలీవ్ చేశారు. అసిస్టెంట్ ఏఎంఓలు చంద్రమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, అసిస్టెంట్ అలెస్కో గోవింద్‌రెడ్డి, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ రాంప్రసాద్, జీసీడీఓ మహేశ్వరిని ఇప్పటికే రిలీవ్ చేయడంతో... వాళ్లు డీఈఓ ఆఫీస్‌లో రిపోర్టు చేసుకున్నారు.

దగ్గరి స్థానాలపై ఒత్తిళ్లు..

ప్రాజెక్టు నుంచి రిలీవ్ అయిన టీచర్లు తమకు దగ్గరి స్థానాలు కేటాయించాలని జిల్లా విద్యాశాఖాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అనంతపురం జిల్లా కేంద్రానికి సమీపంలోని స్కూళ్లు, జాతీయ రహదారికి సమీపంలోని స్కూళ్లు, రోడ్ పాయింట్ ఉన్న స్కూళ్లను తమ ఆప్షన్లుగా జిల్లా విద్యాశాఖాధికారుల వద్ద ఉంచిన ట్లు తెలిసింది. నిబంధనల మేరకు ప్రాజెక్టులోకి రావడానికి ముందు ఏ స్కూల్‌లో పనిచేస్తుండేవారో...అదే ఏ స్కూల్‌కు వెళ్లాలి. ఒక వేళ ఆ స్కూల్‌లో వేకెన్సీ లేకుంటే... అదే మండలంలోని స్కూల్‌కు వెళ్లాలి, లేదా గతంలో పనిచేస్తున్న హెచ్ఆర్‌సీ స్కూల్‌కు వెళ్లాలి. అధిక హెచ్ఆర్‌సీ స్థానాలకు వెళ్లడానికి వీల్లేదు. డీఈఓ సైతం అధిక హెచ్ఆర్సీ స్థానాలు ఇవ్వడానికి వీల్లేదు. గతంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు ఇదే చెబుతున్నాయి. ఇప్పుడు కొందరు పైరవీలు మొదలెట్టారు. వచ్చిన చోటు (పాత స్కూల్)కు కాకుండా నచ్చిన నోటు (కొత్తస్కూల్)కు వెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కొత్త ప్లేసులకు దక్కించుకోడానికి లక్షలు గుమ్మరించడానికి సైతం వెనకాడలేదని సమాచారం. పైరవీకారుల ప్రయత్నాలకు అధికారులు తలొగ్గితే కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీలకు ఫిర్యాదు చేసేందుకు పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సిద్ధమైనట్లు తెలిసింది.

అట్టహాసంగా సత్య ఏజెన్సీస్ ప్రారంభం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 2: జిల్లాకేంద్రంలోని సుభాష్ రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన సత్య ఏజెన్సీస్ 27వ బ్రాంచి ప్రారంభోత్సవాన్ని శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి షాపింగ్‌మాల్ బిల్డింగ్ ఓనర్ సుకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లు మొదలు కొని అన్నిరకాల ఎలక్ట్రానిక్ సామగ్రిని ప్రజలకు అందుబాటుధరల్లో అందించేందుకు సత్య ఏజెన్సీస్‌ను నెలకొల్పడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో సత్య ఏజెన్సీస్ ఎండీ జాన్సన్, ఏపీ హెడ్ సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.



సత్య ఏజెన్సీస్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ పీఏగా శ్రీనివాసులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు2: ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ పీఏగా కళ్యాణదుర్గం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ డీఈగా ఉన్న శ్రీనివాసులుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఉన్న ఎస్ఈ పీఏ రంగయ్య వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్లారు. దీంతో శ్రీనివాసులును నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

విజిలెన్స్ సీఐ వెంకటరమణ బదిలీ

విజిలెన్స్ సీఐ వెంకటరమణ బదిలీ అయ్యారు. కర్నూలు నుంచి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి సీఐగా వచ్చారు. అయితే తిరిగి కర్నూలుకే బదిలీపై వెళ్లారు అక్కడ రిపోర్ట్ చేసుకున్న అనంతరం పోస్టింగ్ ఇవ్వనున్నట్లు తెలిసింది. విజిలెన్స్ విభాగంలో ముగ్గురు సీఐలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఎస్ఐలది అదే పరిస్థితి.

● కళ్యాణదుర్గం రేంజర్‌గా చంద్రహాసన్ నియమితులయ్యారు. కర్నూలు జిల్లాలో డీఆర్వోగా ఉన్న ఈయనకు ఉద్యోగోన్నతి కల్పించి కళ్యాణదుర్గం రేంజర్‌గా నియమించారు.

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి: ఏడీఏ



పొలంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ

నంబులపూలకుంట, ఆగస్టు 2: ఖరీఫ్‌లో సాగు చేసి వేరుశనగ పంటను ఆశిస్తున్న ఆకుముడత, పొగాకు లద్దె పురుగు, టిక్కా ఆకుమచ్చ తెగుళ్ల నివారణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని వెలిచెలమల గ్రామంలో పొలంబడి నిర్వహించారు. రైతులు యజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా చీడపీడలను నివారించవచ్చన్నారు. రసాయనిక ఎరువులు అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. ఆకుముడత నివారణకు క్లోరోఫైరిపాస్ 2.ఎంఎల్, లేదా ప్రెఫోనో పాస్ రెండు ఎంఎల్ లీటర్ నీటిలో, టిక్కా ఆకుమచ్చ నివారణకు హెక్సాప్రొనోజోల్ 2 ఎం.ఎల్. లీటర్ నీటికి, లద్దె పురుగు నివారణకు రెండు కిలోల బెల్లం, 8 కిలోల తవుడు, వందగ్రా. థైయోడికార్బ్‌ను విషపు ఎరగా వాడి నివారించవచ్చన్నారు. వేరుశనగ పంట పూత దశలో ఉండటంతో ఎకరాకు రెండువందల కిలోల జిప్సమ్‌ను వినియోగిస్తే గింజ బరువు, నూనె శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఎం రమణప్ప, ఆర్బీకే సిబ్బంది, ఎంపీఈఓలు, ఎఫ్ఈఎస్ ప్రతినిధి సంధ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులున్నారు.

30 ఏళ్ల ఉద్యమానికి ప్రతిఫలం

- అంబేడ్కర్ ఆశయాలతో చంద్రబాబు సామాజిక స్ఫూర్తి
- ఎస్సీ వర్గీకరణపై కొనసాగుతున్న సంబరాలు



అంబేడ్కర్, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దండోరా నాయకులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు పోరాటపటిమతో సాగించిన 30ఏళ్ల ఉద్యమానికి ప్రతిఫలం దక్కబోతోందని మాదిగ దండోరా, ఎమ్మార్పీఎస్ నేతలు హర్షాన్ని వ్యక్తంచేశారు. ఎస్సీల వర్గీకరణకు పచ్చజెండా ఊపుతూ గురువారం సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై దళిత సంఘాల ఆధ్వర్యంలో సంబరాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మాదిగ దండోరా ఆధ్వర్యంలో అంబేడ్కర్, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకంచేసి స్వీట్లు పంచుకున్నారు. మాదిగ దండోరా రాయలసీమ జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప, ఎమ్మార్పీఎస్ నాయకుడు బీసీఆర్ దాస్ మాట్లాడుతూ వెనకబడిన వర్గాలకు సమానావకాశాలు కల్పించేలా రిజర్వేషన్‌ను డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. ఇదే సామాజిక న్యాయ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంతో ఉపకులాల ప్రజలకు సమాన అవకాశాలు దక్కాయని తెలిపారు. నాయకులు గిరియప్ప, సంపత్‌కుమార్, వెంకటరాముడు, లింగమయ్య, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే జీవితానికి సార్థకత

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్

అనంతపురం క్రైం, ఆగస్టు 2: విద్యార్థి దశలో క్రమశిక్షణ కలిగి ఉన్నప్పుడే జీవితానికి సార్థకత లభిస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. శుక్రవారం విజయనగర న్యాయ కళాశాలలో మాదకద్రవ్య ర్యాగింగ్ నిరోధక చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో న్యాయాధికారి పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణా రాహిత్యం వల్ల వ్యక్తిత్వవికాసాన్ని కోల్పోయి నేరాలకు పాల్పడే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఇందులో మాదకద్రవ్య వినియోగం కూడా ఒకటన్నారు. సోషల్ మీడియా, ఇంటర్నెట్ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్రచార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రమ్య, డిఫెన్స్ లీగల్ ఎయిడ్ సిస్టం డిప్యూటీ చీఫ్ కౌన్సిల్ పెద్దన్న, సీనియర్ న్యాయవాది నరసింహులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపూర్ క్లబ్ విచారణ నివేదిక కలెక్టర్‌కు అందజేత

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 2: అనంతపూర్ క్లబ్‌లో చోటు చేసుకున్న పరిణామాలపై విచారణ నివేదిక కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందజేసినట్లు సమాచారం. క్లబ్‌లో ఎన్నికల నోటిఫికేషన్, అద్దెగదిని ఆక్రమించుకుని వైసీపీ నేతపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ ఓ వైపు ఆర్డీఓ, మరోవైపు డీసీఓలకు విచారణ చేసిన నివేదిక అందజేయాలని ఆదేశించారు. డీసీఓ తరపున సబ్‌డివిజనల్ అధికారి బాలగంగాధర్ రెండు రోజుల పాటు విచారణ చేశారు. క్లబ్ సెక్రటరీ కేశవరెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డిలతో పాటు పాలకవర్గం, సభ్యుల నుంచి ఎన్నికలు, అద్దెగది వ్యవహారంపై విచారణ చేసి పలు వివరాలు సేకరించారు. సబ్‌డివిజనల్ సేకరించిన వివరాలతో కూడిన నివేదికను డీసీఓ కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిసింది.

ఈ-క్రాపింగ్‌పై శిక్షణ

అనంతపురం అర్బన్, ఆగస్టు 2: ఖరీఫ్ ఈ క్రాపింగ్ చేయడంపై శుక్రవారం వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని వ్యవసాయ టెక్నికల్ అధికారి, ఏఓలు, ఒక్కో డివిజన్ పరిధిలోని ఐదు మంది రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణనిచ్చారు. శనివారం మాస్టర్ ట్రైనర్లతో అన్ని రైతు సేవ కేంద్రం సిబ్బందికి శిక్షణనిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఈ పంట నమోదు అప్లికేషన్‌లో సర్వే నంబర్ జియో కో ఆర్డినేట్స్‌తో ఫొటో తీస్తామన్నారు. మండల వ్యవసాయ అధికారులు గ్రామాల వారిగా సర్వే నంబర్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఈ సర్వే నంబర్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఫీల్డ్‌కు వెళ్లి ఈ క్రాపింగ్ చేయాలని ఆదేశించారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 2: ఎస్కేయూ ఉమెన్ సెంటర్ ఆధ్వర్యంలో రచించిన పుస్తకాన్ని శుక్రవారం ఇన్‌చార్జి వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించాల్సిన అవసరముందన్నారు. ఇవే అంశాలపై పరిశోధన చేసిన వర్సిటీ ఉమెన్స్ స్టడీ సెంటర్ ప్రాజెక్ట్ అసియేట్ కల్పన కృష్ణయ్య 'ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' అనే పుస్తకాన్ని రచించడం అభినందనీయమని ప్రసంశించారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 2: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా సప్లిమెంటరీ పరీక్షల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ డిమాండ్‌చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో పరమేష్ మాట్లాడుతూ 2015-18 విద్యా సంవత్సరంలో సబ్జెక్టులు ఫెయిల్ అయిన విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం హర్షణీయమన్నారు. అయితే దరఖాస్తు, ఫీజుల చెల్లింపు వంటి అంశాల్లో విద్యార్థులు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వాటి పరిష్కారానికి తగిన సూచనలు అందించేందుకు హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. నాయకులు రజిత, రమేష్, వంశీ, సిద్దు, గిరి, సూర్య, వెంకి, భీమేష్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

అనంతపురం రూరల్, ఆగస్టు 2: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని కక్కలపల్లి పంచాయతీ బీజేపీ కొట్టాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి పీడీ హాజరయ్యారు. ముందుగా కాలనీలో గర్భిణులు, బాలింతలతో తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలింతలు, గర్భిణులను సమావేశపరిచి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. సీడీపీ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, వరలక్ష్మి, సత్యవేణి, హెల్పర్ సరోజమ్మ పాల్గొన్నారు.

కౌంటర్లు పెంచి అమ్మకాలు రెట్టింపు చేయాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్



రైతు బజారులో ఏర్పాటు చేసిన సబ్సిడీ సరుకుల అమ్మకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం, టౌన్/రూరల్, ఆగస్టు 2: ప్రభుత్వం సరసమైన ధరలకు అందిస్తున్న కందిపప్పు, బియ్యం అమ్మకాల కౌంటర్లను పెంచి విక్రయాలను రెట్టింపు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ప్రజలకు సరసమైన ధరలకే కందిపప్పు, బియ్యం తదితర సరకులను అందించాలని కూటమి ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్లను పౌరసరఫరాలశాఖ ద్వారా ఏర్పాటు చేయించి అమ్మకాలు చేయిస్తోంది. అందులో భాగంగా జిల్లాకేంద్రంలోని రైతుబజారులో ఏర్పాటు చేసిన అమ్మకాల కౌంటర్‌ను కలెక్టర్ శనివారం పరిశీలించారు. కౌంటర్లలో ఉంచిన కందిపప్పు, బియ్యం, ఇతర సరకుల నాణ్యతను ఆయన పరిశీలించారు. బయటున్న ధర, ఇక్కడ ఇస్తున్న ధరలు గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌంటర్లు పెంచి సరకుల అమ్మకాలు పెంచాలన్నారు. జిల్లాలో అన్నినియోజకవర్గాలు కలిపి 51 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి సరకులు ప్రజలకు సరసమైన ధరలకు అందించాలని డీఎస్ఓ, మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్ఓ శోభారాణి, ఇన్‌చార్జి ఆర్డీఓ వసంతబాబు మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణచౌదరి పాల్గొన్నారు.

ఉద్యాన, ఏపీఎంఐపీ కార్యాలయాల తనిఖీ

అనంతపురం అర్బన్: జిల్లా ఉద్యాన శాఖ, ఏపీఎంఐపీ కార్యాలయాలతోపాటు ఉద్యాన శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. ఉద్యాన, ఏపీఎంఐపీ శాఖల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యాలయాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యానశాఖ ఇన్‌చార్జి అధికారి నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తాం

శింగనమల ఆగస్టు 2: మండలంలోని సి.బండమీదపల్లి గ్రామంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి మహిళలు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే ఆదేశం మేరకు ప్రతిరోజు రెండు ట్యాంకర్లతో గ్రామస్థులకు నీటిని సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోండి

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 2: ఖరీఫ్‌కు సంబంధించి పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ ఉదయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మండలంలోని రైతుసేవా కేంద్రాలకు వివరాలతో వెళ్లి బుకింగ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంతోపాటు ఆధార్, లేటెస్టు 1బీ, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ సెల్ నెంబర్‌ను తీసుకెళ్లాలన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌పై విచారణ

అనంతపురం, టౌన్, ఆగస్టు 2: జిల్లా సర్వజన ఆస్పత్రిలో బదిలీపై వెళ్లిన నర్సింగ్ సూపరింటెండెంట్ మంజులపై విచారణ కొనసాగింది. ఇక్కడ గతంలో పనిచేసిన మంజులపై పలువురు స్టాఫ్ నర్సులు అవినీతి అభియోగాలు మోపారు. వీటిపై పత్రికలలో కథనాలు రావడం, ఆస్పత్రిలో నర్సులు రెండుగ్రూపులుగా విడిపోవడం వల్ల అప్పటి కలెక్టరు గౌతమి రెడ్డి ఆమెపై విచారణ జరపాలని ఉత్తర్వులు ఇచ్చారు. పైస్థాయి అధికారులు స్పందించి మంజులను ఇక్కడి నుంచి మదనపల్లి ఆస్పత్రికి బదిలీ చేశారు. అంతటితో ఆగకుండా కర్నూలు వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌ను విచారణాధికారిగా డీఎంఈ నియమించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం విచారణాధికారి డాక్టర్ చిట్టి నరసమ్మ జిల్లా సర్వజన ఆస్పత్రికి వచ్చారు. అప్పుడు నర్సింగ్ సూపరింటెండెంట్ మంజులపై ఫిర్యాదులు చేసిన స్టాఫ్ నర్సులను పిలిపించుకొని వారినుంచి సమాచారం సేకరించి రికార్డులో నమోదు చేసుకున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. విచారణ నివేదికలను డీఎంఈకి నివేదిస్తామని విచారణాధికారి పేర్కొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 2: జిల్లాకేంద్రంలోని వేణుగోపాల్‌నగర్ 80 అడుగుల రోడ్డులో జూలై 22 నుంచి నిర్వహిస్తున్న చిన్నపీర్ల పండుగ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం బీబీ ఫాతిమా, అల్లావలి, అంగార్‌వలి, ఇమామ్ హసేన్, ఇమామ్ హుసేన్‌ల పీర్ల తుదిదర్శనంను నిర్వహించారు. బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు కందుకూరి నాగరాజు, ఉపాధ్యక్షుడు జెబీవుల్లాఖాన్, కార్యదర్శి మొహమ్మద్ రఫీ, కోశాధికారి వెంకటేష్, మాధవ, అంజి, నగేష్, మోహన, రమేష్, వెంకటేష్, మురళి, గోపి పాల్గొన్నారు.

ఫిడే రేటింగ్‌లో జిల్లా క్రీడాకారులకు మెరుగైన స్థానం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 2: ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య సంయుక్తంగా విడుదల చేసిన ఫిడే రేటింగ్‌లో జిల్లా చెస్ క్రీడాకారులకు మెరుగైన స్థానం దక్కింది. నగరంలోని ఏ1 చెస్ అకాడమీకి చెందిన మోయిన్ అహ్మద్ 1434 రేటింగ్, నితీష్ చౌదరి 1425 స్థానం, సూపర్ కింగ్స్ చెస్ అకాడమీ అనన్య 1637, ఆదిత్య రెడ్డి 1474, జమీరుల్ మిస్బా 1451, గుంతకల్లు అనీల్‌కుమార్ 1533 రేటింగ్ స్థానాలను దక్కించుకున్నారు. ఫిడే రేటింగ్ సాధించిన క్రీడాకారులను ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు, కోచ్‌లు గోవిందరాజులు, మెహరాజ్, హుస్సేన్‌ఖాన్ అభినందించారు.

నేటి నుంచి జాతీయ ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 2: జూనియర్ బాలికల జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీలు స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, మల్లేష్ తెలిపారు. శనివారం నుంచి 20వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయని, 30 రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ హాజరవుతారన్నారు.

రైలు నుంచి పడి ఇంటర్ విద్యార్థి మృతి

తాడిపత్రి/గుత్తి ఆగస్టు2: పెద్దపప్పూరు మండలం జూటూరు గ్రామ సమీపంలో రైలులో నుంచి జారిపడి విద్యార్థి అరుణ్ (17) మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామానికి చెందిన రామాంజనేయులు, రమాదేవి దంపతుల కుమారుడు అరుణ్ విజయవాడలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. హోంసిక్ సెలవులపై ఇటీవల ఇంటికి వచ్చాడు. సెలవులు ముగియడంతో గురువారం రాత్రి అనంతపురం నుంచి విజయవాడకు రైలులో బయలుదేరాడు. కాగా అతను డోర్ వద్ద నిలబడడంతో ప్రమాదవశాత్తూ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి తమ్ముడు మధు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

ఆస్పత్రిలో పింఛన్ పంపిణీ



సరోజమ్మకు పింఛన్ అందజేస్తున్న నాయకులు

అనంతపురం రూరల్, ఆగస్టు 2: మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ పిల్లిగుండ్ల కాలనీకి చెందిన సరోజమ్మ నాలుగురోజుల కిందట అనారోగ్యంతో ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈక్రమం లో ఆగస్టు నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను సచివాలయ ఉద్యోగితో కలసి టీడీపీ నాయకులు ఆస్పత్రిలోనే పంపిణీ చేశారు. మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ, మాజీ సర్పంచు సుశీలమ్మ, టీడీపీ నాయకులు ప్రకాష్, సచివాలయ ఉద్యోగి ధనుంజయ పాల్గొన్నారు.

కక్షసాధింపుతోనే ఉద్యోగం నుంచి తొలగించారు

- న్యాయం చేయాలని టీసీ వరుణ్‌కు దివ్యాంగుడి వినతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 2: కేవలం పవన్‌కళ్యాణ్ వీరాభిమానన్న ఒకే ఒక్క కారణంతో గత వైసీపీ ప్రభుత్వంలో తనను ఉద్యోగంలో నుంచి తొలగించారని దివ్యాంగుడు రుద్రకుమార్ జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ వద్ద తన గోడు వెల్లబోసుకున్నాడు. శుక్రవారం టీసీ వరుణ్‌ను కలిసిన దివ్యాంగుడు ఆవేదను వెలిబుచ్చాడు. డ్వామా కార్యాలయంలో అటెండర్ పనిచేస్తున్న తనను గత వైసీపీ ప్రభుత్వం, కొందరు నేతలు కావాలనే ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. స్పందించిన టీసీ వరుణ్ పవన్‌కళ్యాణ్ ఆశయాల కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందన్నారు. నీకు జరిగిన అన్యాయాన్ని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

12న రైఫిల్ షూటింగ్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 2: జిల్లా రైఫిల్ షూటింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఎస్కే యూనివర్సిటీ సమీపంలోని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 12, 13వ తేదీలలో నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి నవీన్‌చౌదరి తెలిపారు. ఆసక్తి గల రైఫిల్ షూటింగ్ బాల, బాలికల క్రీడాకారులు 10వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9494836617ను సంప్రదించవచ్చన్నారు.

నగరంలోని సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యేకు సీపీఎం నాయకుల వినతి



ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు సమస్యలు వివరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 2: అనంతపురం నగరంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో సీపీఎం జిల్లా కార్యాదర్శి రాంభూపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, నగర కార్యదర్శి రామిరెడ్డి ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ కార్మికులు దశాబ్దాలుగా పనిచేస్తున్నా కనీసం ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. మీరైనా ప్రత్యేక చొరవ తీసుకొని కార్మికులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమలేష్, ఎర్రిస్వామి, కుమార్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

నేడు సహకార శాఖ అధికారుల సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 2: సహకార శాఖ అధికారులతో శనివారం రాష్ట్ర వ్యవసాయ-సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆర్‌సీఎస్ అహ్మద్‌బాబు రాజధాని అమరావతిలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయభాస్కర్ హాజరుకానున్నారు. సొసైటీలతో పాటు ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌ల పాలకవర్గాల నియామకం, ఓటర్ల జాబితా తయారు, ఎన్నికల నిర్వహణపై సమీక్షించనున్నట్లు ఆశాఖ అధికారులు తెలిపారు.


ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


బెళుగుప్పలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు


కుందుర్పిలో ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

- టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల హర్షం
- పలుచోట్ల ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి సంబరాలు

ఉరవకొండ, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని టీడీపీ ఎస్సీ సెల్ నాయకురాలు సరస్వతమ్మ, టీడీపీ నాయకుడు దేవినేని పురుషోత్తం, మండల, పట్టణ కన్వీనర్లు విజయ్ భాస్కర్, రామాంజినేయులు పేర్కొన్నారు. తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం వారు పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ గతంలో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడే చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరప్రసాద్, రామకృష్ణ, రాజు, కౌకుంట్ల రవి, సురేష్, చెన్నప్ప, రామాంజినేయులు, చంద్రశేఖర్, పెద్దన్న, నాగరాజు పాల్గొన్నారు. అలాగే వజ్రకరూరులో టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, ఎస్సీ సెల్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు రఘు, రవీంద్ర, ఓబులేశు, రామాంజినేయులు, సుధాకర్, టీడీపీ నాయకులు దస్తగిరి, నాగేంద్ర, చాబాల ఈశ్వర్, వన్నూరుస్వామి, ఎర్రిస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు పట్ల మండల కేంద్రంలో టీడీపీ నాయకులు, ఎస్సీసెల్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఘన నివాళులర్పించారు. అలాగే అంబేడ్కర్, సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచారు. పలువురు మాట్లాడుతూ గతంలోనే చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికారని గుర్తు చేశారు. ఇందుకు ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగతో ఎంతో పోరాడారని తెలిపారు. టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, సర్పంచ్ వెంకటనాయుడు, నాయకులు దుద్దేకుంట తిమ్మప్ప, దామోదర, శ్రీనివాసులు, బీజేపీ, జనసేన నాయకులు వన్నూరుస్వామి, సుధీర్ శెట్టి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు అంజన్‌ప్రసాద్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఉద్యమాలు జరిగాయన్నారు. ప్రస్తుతం సుప్రీం కోర్టు తీర్పుతో 59 ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామదాసు, రామకృష్ణ, రాము, కుళ్లాయప్ప, కాశీ, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, టీడీపీ శ్రేణులు కలిసి ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చిత్రపటాలతో పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగింది. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కళ్యాణదుర్గం: పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి, మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తర్వాత అంబేడ్కర్ విగ్రహం నుంచి టీ సర్కిల్ వరకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వర్ధిల్లాలి ,మందకృష్ణ మాదిగ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. విశ్వరూప మహాసభలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి, సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మారెప్ప, గోవిందప్ప, సీనియర్ నాయకులు గంగాధర, నరసింహులు, బీజేపీ నాయకుడు దేవరాజు, జనసేన నాయకుడు రాజేష్ పాల్గొన్నారు.

కూడేరు: సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ మండలకేంద్రంలో దళిత సంఘాల నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్, టీడీపీ, సీపీఐ, పార్టీలకు చెందిన దళిత నాయకులు పెద్దఎత్తున ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకుని అక్కడ ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

కణేకల్లు: మండల కేంద్రంలోని ఉడేగోళం సర్కిల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రకాష్, యర్రగుంట్ల రామాంజినేయులు, ఆలూరు గంగాధర, కుళ్లాయప్ప, వన్నూరుస్వామి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గాంధీసర్కిల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుమునుపు కేక్‌కట్ చేసి బాణాసంచా కాల్చారు. నాయకులు గంగరాజు, వుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని యర్రగుంటపల్లిలో ఉన్న తెల్లబండ్ల రవి ఇంటివద్ద నుంచి భారీ సంఖ్యలో ర్యాలీగా ఆయన స్తూపం వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు కంబగిరిస్వామి, సుంకన్న, ఈశ్వరయ్య, రత్నం, శివుడు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కొండయ్య , రామాంజనేయులు, నాగేష్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

యాడికి: రాయలచెరువులోని ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్‌కట్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు కుళ్లాయప్ప, రాజు, శ్రీకాంత్, రవి, గోపాల్, అవినాష్, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, నాయకులు పాల్గొన్నారు.

ఆరుగురికి షోకాజ్ నోటీసులు

యల్లనూరు, ఆగస్టు 2: సామాజిక పింఛన్ల పంపిణీని ఆలస్యంగా ప్రారంభించిన సచివాలయ సిబ్బంది ఆరుగురికి కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు ఎంపీడీఓ వీర్రాజు తెలిపారు. చింతకాయమంద-1 సచివాలయంలో ఏఎన్ఎం, మహిళా పోలీస్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్‌కు, మల్లాగుండ్ల సచివాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు, కల్లూరు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌కు నోటీసులు అందాయని అన్నారు. ఉదయం 6గంటలకు పంపిణీ ప్రారంభించాల్సి ఉండగా ఆలస్యంగా ప్రారంభించడంతో వాటిని అందజేసినట్లు చెప్పారు.

ఏడుగురికి..

రాయదుర్గంరూరల్ : మండలంలో పింఛన్ పంపిణీలో నిర్లక్ష్యం వహించిన ఏడుగురు సచివాలయ ఉద్యోగులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఈఓపీఆర్డీ రంగనాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మెచ్చిరి వీఆర్వో వసంతరాయుడు, జుంజురంపల్లి మహిళా పోలీస్ మాలిని, పల్లేపల్లి వెల్ఫేర్ అసిస్టెంట్ శారద, ఆర్‌బీవంక డిజిటల్ అసిస్టెంట్ నవీన్‌కుమార్, మల్లాపురం వీఆర్వో కిరణ్‌కుమార్, మల్లాపురం డిజిటల్ అసిస్టెంట్ పూజ, పల్లేపల్లి వ్యవసాయ సహాయ అధికారి అబ్దుల్లాకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయన్నారు. అనంతరం వారి నుంచి సంజాయిషీని రాతపూర్వకంగా తీసుకొని జిల్లా అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

14 మందికి..

కణేకల్లు: మండలంలో పింఛన్ల పంపిణీలో అలసత్వం వహించిన 14 మందికి కలెక్టర్ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ గూడెన్న తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో కణేకల్లు మండల కేంద్రంలోని 2, 3, 4వ సచివాలయాల సిబ్బందితో పాటు హనకనహాళ్, పూలచెర్ల, గెణిగెర, తుంబిగనూరు, హనుమాపురం గ్రామాల పరిధిలోని ఉద్యోగులు ఉన్నారన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్


గుత్తిలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 2: ప్రభుత్వం విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా శుక్రవారం గుంతకల్లుకు చేరుకుంది. స్థానిక కేజీబీవీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 6వ తేదీన జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయ్యస్వామి, రాష్ట్ర సమితి సభ్యురాలు సాయిస్వరూప, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

6న ధర్నాకు తరలిరండి

గుత్తి: విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 6వ తేదీన జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా జరగనుందని, కార్యక్రమాన్ని విద్యార్థులు విజయవంతం చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఆ ఫెడరేషన్ నాయకులు చేపట్టిన జీపుజాతా శుక్రవారం గుత్తికి చేరింది. స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈ మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా ఉరవకొండకు చేరుకుంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జాన్సన్‌బాబు, శివారెడ్డి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ 6వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హారున్ రషీద్, రాజు, లెనిన్, నవీన్ కుమార్, సురేష్ ఆకాష్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంపై ఇద్దరికి మెమోలు

యల్లనూరు, ఆగస్టు 2: గ్రామంలో తాగునీటి సమస్య జటిలంగా ఉన్నప్పటికీ అధికారుల దృష్టికి తీసుకురాకపోవడంతో శుక్రవారం మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ సుప్రజారెడ్డికి, కూచివారిపల్లి పంచాయతీ సెక్రెటరీ గంగాదేవికి ఎంపీడీఓ వీర్రాజు మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, నీటి కోసం వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళుతున్నామని ఆ కాలనీవాసులు రెండురోజులక్రితం మండలకేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే బండారు శ్రావణికి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓను ఆదేశించారు. తాగునీటి సమస్యపై తమ దృష్టికి తీసుకురానందుకు గాను రెండురోజుల్లోపు వివరణ ఇవ్వాలని ఎంపీడీఓ ఆ అధికారులకు మెమోలు పంపించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 2: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా సబ్ యూనిట్ మలేరియా అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. పట్టణంలోని ఏడవ సచివాలయం పరిధిలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో అధికారి నాగేంద్రప్రసాద్ పాల్గొని వార్డులను సందర్శించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా, డెంగీ తదితర వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ప్రమీల, విజయలక్ష్మి, ఆశావర్కర్లు పద్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

చెక్కభజన రాష్ట్ర అధ్యక్షుడిగా కుళ్లాయప్ప


కుళ్లాయప్పను సన్మానిస్తున్న సభ్యులు

పెద్దపప్పూరు, ఆగస్టు 2: మండలంలోని అమ్మలదిన్నె గ్రామానికి చెందిన కుళ్లాయప్ప చెక్కభజన కళాకారుల అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపియ్యారు. ఇందుకు మండలకేంద్రంలో శుక్రవారం ఆయన్ను సంఘం సభ్యులు కళాకారులు సన్మానించారు. ఈ సందర్భంగా కుళ్లాయప్ప మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కళాకారుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని అన్నారు.

ఆశా వర్కర్‌కు పింఛన్‌పై ఫిర్యాదు

బ్రహ్మసముద్రం, ఆగస్టు 2: మండలంలోని గోవిందయ్యదొడ్డి గ్రామానికి చెందిన పసులయ్య గారి మారెక్క ఆశావర్కర్‌గా పనిచేస్తున్నారని, అయితే ఆమె వికలాంగుల పింఛన్ కూడా పొందుతున్నారని గ్రామస్థులు ఎంపీడీవో దాసానాయక్‌కు శుక్రవారం మండలకేంద్రానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో కూడా ఆమె ఆశావర్కర్‌గా జీతం పొందడంతో పాటు వికలాంగురాలిగా కూడా పింఛన్ పొందిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే ఆమెను ఆశావర్కర్ విధుల నుంచి తొలగించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం నుంచి పొందిన పింఛన్ సొమ్మును రికవరీ చేయాలని కోరారు. ఎంపీడీవో దాసానాయక్ మాట్లాడుతూ గ్రామంలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అర్హులకు పక్కా ఇళ్లు మంజూరు చేస్తాం

కళ్యాణదుర్గం(శెట్టూరు), ఆగస్టు 2 : శెట్టూరు మండల వ్యాప్తంగా అర్హులైన వారికి పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని కళ్యాణదుర్గం హౌసింగ్ డీఈ విజయ భాస్కర్ రావు తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. గతంలో ఇళ్లు మంజూరు కాని వారికి మొదటి ప్రాధాన్యతగా పక్కా ఇళ్లు నిర్మిస్తామన్నారు. మంజూరై నిర్మాణ పనులు వివిధ దశలలో ఆగిపోయిన వారికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ రఘురామారావు, హౌసింగ్ ఏఈలు విజయ్, మారుతి పాల్గొన్నారు.

చేనేతలకు షరతులు లేని ముద్ర రుణాలివ్వాలి

యాడికి, ఆగస్టు2: చేనేతలకు ఎలాంటి షరతులు లేకుండా ముద్ర రుణాలు ఇచ్చేలా చూడాలని కోరుతూ మండలకేంద్రంలోని చేనేత కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ జిల్లా అధికారి అప్పాజికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతలకు ముద్ర రుణాలు ఇవ్వాలంటే బ్యాంకర్లు షరతులు పెడుతున్నారని, అలాంటివి ఏవీ లేకుండా చూడాలని కోరారు. అలాగే నేతన్ననేస్తం రూ.48వేలకు పెంచాలని, చేనేతపై ఉన్న 5శాతం జీఎస్టీని రద్దు చేయాలని, చేనేతలకు వృత్తి రక్షణ, ఉపాధి భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని , ఆత్మహత్యలకు పాల్పడిన చేనేత కార్మిక కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జాతీయ చేనేత ఐక్యవేదిక నాయకుడు నారాయణస్వామి, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు మోహన్, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి బషీర్ అహమ్మద్, చేనేత కార్మికులు ఉన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ ప్రారంభం

కూడేరు, ఆగస్టు 2: మండల కేంద్రంలోని ఎన్‌సీసీ క్యాంపులో శుక్రవారం విద్యార్థులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా క్యాంపు కమాండెంట్ కల్నల్ రాడ్రిక్స్ మాట్లాడుతూ ఈ క్యాంపు పదిరోజుల పాటు జరుగుతుందన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 650 మంది విద్యార్థులు శిక్షణకు హాజరైనట్లు తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

యల్లనూరు, ఆగస్టు 2: మండలకేంద్రంలో గురువారం రాత్రి పోలీస్‌స్టేషన్ బయట దాడిచేసుకున్న ఘటనలో ఆరుగురిపై కేసు నమోదుచేసినట్లు ఏఎస్ఐ సంపత్ తెలిపారు. ముని, నాగరంగయ్య గొడవపడి పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చారని , వీరిద్దరిని విచారిస్తుండగానే.. ఇరువర్గాలకు చెందిన కొందరు వచ్చి ఒకరిపైఒకరు స్టేషన్ ఎదుటనే దాడి చేసుకున్నారన్నారు. ఈ విషయంలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదుచేసినట్లు ఆయన పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం


జయచంద్ర

పుట్లూరు, ఆగస్టు 2: మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన యువకుడు నారా జయచంద్రనాయుడు అదృశ్యమయ్యాడని ఎస్ఐ హేమాద్రి తెలిపారు. సూరేపల్లికి చెందిన రవీంద్రనాయుడు, రాములమ్మ దంపతుల చిన్న కుమారుడు జయచంద్రనాయుడు అనంతపురంలో ఆటో మొబైల్ స్పేర్‌పార్ట్స్ బిజినెస్ చేస్తానని చెప్పి మూడేళ్లక్రితం వెళ్లాడు. అక్కడ వ్యాపారంలో నష్టం రావడంతో ఉద్యోగం చేసి అప్పును తీరుస్తానని ఇటీవల సెల్‌కు మెసెజ్ పెట్టి కనిపించకుండా పోయాడు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన వ్యక్తి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి పడి ఇంటర్ విద్యార్థి మృతి


అరుణ్ (ఫైల్)

తాడిపత్రి/ గుత్తి ఆగస్టు 2: పెద్దపప్పూరు మండలం జూటూరు గ్రామ సమీపంలో రైలులో నుంచి జారిపడి విద్యార్థి అరుణ్ (17) మృతి చెందాడని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. బుక్కరాయసముద్రం మండలం రేకుల కుంట గ్రామానికి చెందిన రామాంజనేయులు, రమాదేవి దంపతుల కుమారుడు అరుణ్ విజయవాడలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. హోంసిక్ సెలవులపై ఇటీవల ఇంటికి వచ్చాడు. సెలవులు ముగియడంతో గురువారం రాత్రి అనంతపురం నుంచి విజయవాడకు రైలులో బయలుదేరాడు. కాగా అతను డోర్ వద్ద నిలబడడంతో ప్రమాదవశాత్తూ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి తమ్ముడు మధు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

కళ్యాణదుర్గం(శెట్టూరు), ఆగస్టు 2: శెట్టూరు మండలంలోని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఇందులో రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిన జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని, ఉద్యోగులకు రక్షణ లేని సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు ఈరన్న, జిల్లా ఆడిట్ మెంబర్ రవి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్, మురళి, కోశాధికారి చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

తాడిపత్రి, ఆగస్టు 2: కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు చేపట్టిన సర్వేను శుక్రవారం జిల్లా అధికారులు గంగాధర్‌రెడ్డి, నాగన్న పరిశీలించారు. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఉన్న హాస్పిటల్‌లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు చేసిన సర్వేను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కుష్ఠువ్యాధిని ప్రారంభదశలోనే గుర్తిస్తే చికిత్స అందించి అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చునని తెలిపారు. సర్వే సక్రమంగా చేసి కొత్త కేసులను గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. వారివెంట వైద్యులు శ్రీనివాసులురెడ్డి, సుమన్, యశశ్విని ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


అనంతపురం ఆస్పత్రిలో రంగనాయకులుకు పింఛన్ అందజేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్

యాడికి, ఆగస్టు 2: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఇద్దరు పింఛన్‌దారులకు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమేష్ అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. యాడికి సచివాలయం -1 పరిధిలోని వద్ది రంగనాయకులు, కల్లమడి లక్ష్మీదేవి వృద్ధాప్య పింఛన్ పొందుతున్నారు. అనారోగ్యంతో వారు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పింఛన్ సొమ్ము తీసుకోవడానికి వారు రాలేని పరిస్థితిలో ఉన్నట్లు తెలుసుకున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమేష్ శుక్రవారం అనంతపురం వెళ్లి వారికి పింఛన్ అందించారు.

ఉరవకొండ: మండలంలోని లత్తవరం గ్రామానికి చెందిన వృద్ధుడు పోలేరప్ప అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుండగా సచివాలయ కార్యదర్శి ఆశీర్‌బాబు అక్కడికే వెళ్లి పింఛన్ అందించాడు. సచివాలయ కార్యదర్శి సొంత ఖర్చులతో అనంతపురం వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ సొమ్ము అందజేశారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని ముద్దలాపురం గ్రామానికి చెందిన ఎరుకల రామక్క బళ్లారిలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న కన్నెపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు బళ్లారి ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛన్ పంపిణీ చేశారు. అదేవిధంగా కన్నేపల్లి గ్రామానికి చెందిన హరిజన వన్నూరమ్మ అనంతపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుండడంతో డిజిటల్ అసిస్టెంట్ రంగేశ్వరి అక్కడికే వెళ్లి ఆమెకు పింఛన్ అందించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 2: బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ పాటు పడాలని ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి సూచించారు. పట్టణంలోని కథల వీధిలో గల మారెమ్మ ఆలయంలో శుక్రవారం శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ సమితి, 12వ వార్డు టీడీపీ నాయకుడు రుద్రాక్షల మహేష్ ఆధ్వర్యంలో బుడుగ జంగాల కులస్థులకు బాల్యవివాహాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, సీడీపీఓ డిల్లీశ్వరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆర్డీఓ మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. చిన్న వయసులో పెళ్లి చేస్తే అమ్మాయి శారీరక.. మానసిక రుగ్మతలకు లోనవుతారని చెప్పారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణ్‌ప్రసాద్, జిల్లా కార్యదర్శి మోహన్‌కృష్ణ, వైద్యురాలు స్వాతి, ఏఎస్ఐ మంజుల, డీసీపీయూ వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్ పెద్ద వెంకటేశు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో ప్రజాధనం దుర్వినియోగం'

ఉరవకొండ, ఆగస్టు 2: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉరవకొండలో అభివృద్ధి పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని వార్డు సభ్యుడు ప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని మేజరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ లలితమ్మ అధ్యక్షత పంచాయతీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పంచాయతీ ఆదాయవనరుల టెండర్లకు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో వార్డు సభ్యుడు ప్రభాకర్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో రూ.2కోట్లతో పనులు చేశామని గొప్పలు చెప్పుకున్నారని, కాగా రోడ్లు వేసిన ఆరు నెలలకే దెబ్బతిన్నాయని అన్నారు. నాసిరకం పనులు వల్లే రోడ్లన్నీ గుంతలు ఏర్పడ్డాయన్నారు. రోడ్ల దుస్థితికి సంబంధించిన ప్లకార్డులను సభ్యుడు సమావేశంలో ప్రదర్శించారు. దెబ్బతిన్న రోడ్ల వివరాలను ఈవోకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నిరంజన్‌గౌడ్, వాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు నిధులు మంజూరు

పుట్లూరు, ఆగస్టు 2: మండలకేంద్రంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.10లక్షలు మంజూరైనట్లు స్థానిక టీడీపీ నాయకుడు పుట్లూరు పుల్లారెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జడ్పీ నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేశారన్నారు. మండలకేంద్రంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రెండు బోర్లు వేయించడానికి ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్ నిధులు కేటాయించారన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెద్దవడుగూరు, ఆగస్టు 2: మండలంలోని మిడుతూరు వద్దనున్న 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా పెద్ద తుమ్మల గ్రామానికి చెందిన వీరేష్ (27) పామిడిలో భవన నిర్మాణ పనులు చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. కాగా శుక్రవారం సాయంత్రం బైక్‌లో గుత్తి నుంచి పామిడికి వస్తుండగా.. మిడుతూరు వద్ద అదుపుతప్పి బోల్తాపడ్డాడు. తీవ్రంగా గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రెడ్డెప్ప తెలిపారు.

చైన్ స్నాచింగ్

గుంతకల్లు టౌన్, ఆగస్టు 2: పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో నీలావతి అనే మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు లాక్కొని పరారయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రిటైర్డ్ ఏఎస్ఐ త్యాగరాజు సతీమణి నీలావతి శుక్రవారం ఉదయం ఇంటి ముందర కసువు ఊడ్చి చెత్తను సమీపంలోని డస్ట్‌బిన్‌లో వేసేందుకు వెళ్తోంది. ఆ సమయంలో ఇద్దరు గుర్తుతెలియని దుండగులు బైక్‌లో వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. ఆమె గట్టిగా అరిచేలోపు వారు పరారయ్యారు. బాధితురాలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దుండగుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

దుకాణాల్లో చోరీ

గుంతకల్లు టౌన్, ఆగస్టు 2: పట్టణంలోని విద్యానగర్-1లో గల కిరాణా షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు షాపు తాళాలను పగలగొట్టి లోపలికి చొరబడి సిగరెట్లు, రూ.3వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు అబ్దుల్లా తెలిపాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. అలాగే సీఎస్ఐ చర్చి సమీపంలోని కూల్‌డ్రింక్ షాపులో చోరీ జరిగింది. అందులోని కూల్‌డ్రింక్ బాటిళ్లను దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు దౌల్తా తెలిపారు.

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో ఉన్న రెండు దుకాణాలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు బాధితులు శుక్రవారం తెలిపారు. శ్రీరంగ ఫర్టిలైజర్స్, రవూఫ్ హోటల్ షట్టర్లను గురువారం రాత్రి ధ్వంసంచేసి లోనికి చొరబడి రెండు అంగళ్లలో కలిపి రూ. 4 వేలు అపహరించినట్లు బాధితులు వాపోయారు. గతంలోనూ ఈ దుకాణాలలో చోరీలు జరిగాయన్నారు. అనంతరం వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పింగళి వెంకయ్యకు ఘననివాళి

ఉరవకొండ,ఆగస్టు 2: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి గౌస్, సర్పంచ్ లలితమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రెండిళ్లపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

తాడిపత్రి, ఆగస్టు 2: పట్టణంలోని ఓంశాంతినగర్‌లో గురువారం అర్ధరాత్రి సమయంలో రెండిళ్లపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడిచేశారు. ఈ దాడుల్లో ఇంటికి ఉన్న అద్దాలు ధ్వంసమయ్యాయి. దాడికి గల కారణాలు తెలియరాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు


పసుపు కొమ్మల అలంకరణలో పెద్దమ్మ

యాడికి, ఆగస్టు 2: మండలకేంద్రంలో పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు అమ్మవారికి పసుపు కొమ్మలతో ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం చెన్నకేశవస్వామి ఆలయం నుంచి మంగళవాయిద్యాల నడుమ చీర, సారె తెచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

శాకంబరి అలంకరణలో మారెమ్మ


శాకంబరి అలంకరణలో మారెమ్మ

గుంతకల్లుటౌన్, ఆగస్టు 2: ఆషాఢ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మస్తాన్‌పేటలో గల మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు అమ్మవారిని శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు. ఆలయ కమిటీ సభ్యుడు రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవీమాత

గుత్తి: పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజల్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుడు వాసుదేవశర్మ అమ్మవారిని శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్య వాసవీ మహిళా మండలి సభ్యులు సుమారు 120 మంది కుంకమార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.